ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టార్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్‌ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.

తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!

సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్‌ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్‌ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.

ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు.ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

బ్యాంకుల్లో పైసల్లేవ్

నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

మారిన సగటు మదుపరి పొదుపు • ఫండ్లవైపే భారతీయుల చూపు

రూ.0.95 లక్షల కోట్లకు పతనం

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

ఇదీ సంగతి..

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల పైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా ఆవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కఠిన చర్యలున్నా..

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిటర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

9 లక్షల కోట్లు ఆవిరి

వరుస నష్టాల్లో మదుపరులకు పెద్ద దెబ్బ

ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్‌లు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లె, ఎల్‌అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమోడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.

బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లులో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్యాండెడ్ యాక్సెసిరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఓప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.

మాతృ మరణాలపై విచారణ

ఊట్కూర్, అక్టోబర్7: మాతృ మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శైలజ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ దవాఖానను సందర్శించిన ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీన స్థానిక దేవీనగర్ వీధికి చెందిన గుడిసె పద్మ హైదరాబాద్ ఉస్మానియా దవాఖానలో ప్రసవ వేదనతో మృతిచెందగా సిబ్బంది సమక్షంలో విచారణ చేపట్టారు. గర్భిణులు ప్రభుత్వ దవాఖానల్లో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు జరుపుకోవాలని, సమీప దవాఖానల్లోనే ప్రసవం పొందేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవోలు విజయకుమార్, గోవిందరాజు, నర్సింహులు, ఏఎన్ఎం కవిత పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని రైతు మౌర

బాలానగర్, అక్టోబర్ 7: పంట రుణం రూ.2లక్షలకు మాఫీ చేయాలని కోరుతూ మండలంలోని సూరారం రైతు పాండయ్యగౌడ్ సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. అలాగే సూరారం గ్రామ శివారులోని తమకు సంబంధించిన పొలం తాలూకు వివరాలు ధరణిలో నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశాడు. గౌతాపూర్‌లోని రెండు పడక గదుల ఇండ్లలో మరుగుదొడ్లు నిండిపోయి మురుగు నీటి కాల్వల్లో నీరు వెళ్లడం లేదని కాలనీవాసులు దరఖాస్తు చేశారు. కార్యక్రమంలో తాసీల్దారు శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమారి, ఏఈపీఆర్ కురుమూర్తి, ఏఈఆర్‌డబ్ల్యూఎస్ అభినవ్, ఏఈఈ అభిజ్ఞ, అధికారులు శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వాలి

ధన్వాడ, అక్టోబర్ 7 : ఈ ఏడాది సరియైన పంటలు చేతికరాక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు వెంటనే రైతు భరోసా అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు అనేక హామీలు అమలు చేసినా ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయడం లేదని, రైతులను చిన్న చూపు చూస్తున్నదని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్పందించి అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయడంతోపాటు కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వాలని కోరారు.

దివ్యాంగుడిపై దాడి: కేసు నమోదు

నవాబ్‌పేట, అక్టోబర్ 7: మండలంలోని కారుకొండకు చెందిన దివ్యాంగుడు కొండకళ్ల కేశయ్య(35)పై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు అకారణంగా దాడి చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. గ్రామానికి చెందిన కేశయ్య గ్రామంలో ఒక డబ్బాలో చిన్న పాటి కిరాణా కొట్టు నడుపుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన శేఖర్, రాజు ఆదివారం రాత్రి కిరాణా డబ్బా వద్దకు వెళ్లి కేశయ్య వద్ద అకారణంగా గొడవపడి భార్యాభర్తలపై దాడి చేశారు. భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కూచిపూడి నాట్యం చేస్తున్న మహిళలు

మక్తల్, అక్టోబర్ 7: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మక్తల్ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వాసవీమాత ఆలయంలో చేపట్టిన బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజువారీ కార్యక్రమంలో ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో మహిళలకు నిర్వహించిన కూచిపూడి, భరతనాట్యం చూపరులను ఎంతగానో ఆకర్షించాయని ఆలయ కమిటీ సభ్యులు సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం వాసవీమాతను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో బతుకమ్మకు అవమానం

- **పాలమూరులో పూజలు చేయకుండానే సంబురాలు**
- **ప్రతిమల వద్ద కాళ్లకు బూట్లు తొడుక్కొని నిలబడిన ప్రజాప్రతినిధులు, అధికారులు**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 7: తెలంగాణ రాష్ట్ర ఆత్మ గౌరవం బతుకమ్మ.. అలాంటి బతుకమ్మ సంబురాలను కేసీఆర్ హయాంలో పది రోజుల బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తే.. నేడు కాంగ్రెస్ పాలనలో బతుకమ్మ సంబురాలకు అమవానం చోటుచేసుకున్నది. ప్రభుత్వ హయాంలో సోమవారం మహబూబ్‌నగర్‌లో కనీసం పూజలు కూడా చేయకుండానే నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి లక్ష్మీప్రసన్నతో హాజరయ్యారు. ప్రతిమల వద్ద ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు కాళ్లకు బూట్లు తొడుక్కొని కన్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రంథాలయ చైర్మన్ నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ షబ్బీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత పాల్గొన్నారు.

పాలమూరులో బతుకమ్మల వద్ద కాళ్లకు బూట్లతో నిలబడిన ప్రజాపతినిధి, అధికారులు

నారాయణపేటలో బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ,కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 7: తీరొక్కపూలు తెచ్చి.. తీరిగ్గా దండ గుచ్చి.. బతుకమ్మను చేద్దామే బతుకిమ్మని అందామే..! రావే లచ్చులూ బతుకమ్మా ఆడదాం.. రావే లచ్చులూ..! అంటూ జిల్లా కేంద్రానికి సమీపంలోని శివసాయిరాం కాలనీలో మహిళలు, కాలనీవాసులు ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. ఏలో ఎన్నియాలో అంటూ బతుకమ్మ పాటలకు ఆడిపాడారు. ఈ కార్యక్రమాల్లో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, భీమాచారి, కల్చరల్ సెక్రటరీ వెంకట్రాములు యాదవ్, సునీత, రాధిక, విజయ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేటలో..

నారాయణపేటరూరల్, అక్టోబర్ 7 : మండలంలోని జాజాపూర్ గ్రామంలోని చౌడేశ్వరి ఆలయం వద్ద సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ సంబురాలలో భాగంగా సోమవారం దేవాంగ సంఘం మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను తయారు చేసిన ఆట పాటలతో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పుట్టింటి వాయనం

ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి వాయనం అందజేస్తున్న మహిళలు

ధన్వాడ, అక్టోబర్ 7 : నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సోమవారం ధన్వాడలో ఏర్పాటు చేసిన దుర్గామాతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి పుట్టింటి వాయనంగా చీర సారెను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను పుట్టిన గడ్డపై తనకు పుట్టింటి వాయనం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

ఇసుక డంపు సీజ్

హన్వాడ, అక్టోబర్ 7: మండలంలోని చిన్నదర్‌పల్లి సమీపాన పూజారి తండాలో ఎలాంటి అనుమతులు లేకుండా నందిపేంట సత్యయ్య అక్రమంగా నిల్వ చేసిన 60ట్రాక్టర్ల ఇసుక డంపులను రెవెన్యూ అధికారులతో కలిసి సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. సీజ్ చేసిన ఇసుకను ఎవరైన రాత్రి వేళల్లో తరలిస్తే వారిపై చట్టరీతా చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైన అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దేవరకద్రలో..

దేవరకద్ర, అక్టోబర్ 7: మండలంలోని గోపన్‌పల్లిలో అక్రమంగా నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసినట్లు తాసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. తాసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని గోపన్‌పల్లి గ్రామసమీపంలోని వాగు నుంచి అక్రమంగా తరలించి వ్యవసాయ భూమిలో నిల్వ ఉంచినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అక్కడ 25 ట్రాక్టర్ల ఇసుక ఉండడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. గ్రామ సమీపంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుకను ఎవరైనా తరలిస్తే వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తాసీల్దార్ హెచ్చరించారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్, అక్టోబర్ 7: మండలంలోని దుందుభీవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. దుందుభీవాగు నుంచి రాత్రిళ్లు అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని ఇసుక అనుమతులు లేవన్నారు.

పగిడిమర్రి చెరువులో మొసలి కలకలం..

పగిడిమర్రి చెరువు నీటిలో కనిపిస్తున్న మొసలి

ఊట్కూర్, అక్టోబర్ 7: మండలంలోని పగిడిమర్రి చెరువు నీటిలో సోమవారం మొసలి కలకలం సృష్టించిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొంతమంది యువకులు మధ్యాహ్నం సమయంలో చేపలవేటకు వెళ్లగా మొసలి కనిపించడంతో భయాందోళన చెందారు. ఈ క్రమంలో సెల్‌ఫోన్‌లో మొసలి ఫొటోను చిత్రీకరించి రైతులు, యువకులు చెరువు వద్దకు వెళ్లరాదని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అటవీ అధికారులు స్పందించి మొసలిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మరికల్, అక్టోబర్ 7 : క్రీడలతో యువకుల మధ్య స్నేహ సంబంధాలు, మానసికోల్లాసం కలుగుతుందని ఎస్సై మురళీ అన్నారు. సోమవారం మండలకేంద్రంఓల మండల స్థాయి టీ10 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వీరన్న, హరీశ్, సురేశ్ పాల్గొన్నారు.

నవాబ్ పేటలో కార్గో సేవలు ప్రారంభం

నవాబ్‌పేట, అక్టోబర్ 7: మండల కేంద్రంలో సోమవారం టీజీ ఆర్టీసీ కార్గో సేవలను కార్గో సేల్స్ ఆఫీసర్స్ రాజ్‌కుమార్, శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీసాయి ఎలక్ట్రానిక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు కార్గో సేవలను ప్రారంభించి మాట్లాడారు. మరిన్ని వివరాలకు 9440116169 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కోట్ల రాజు, నరేశ్ పాల్గొన్నారు.

సూర్యనంది క్షేత్రంలో పూజలు

నారాయణపేట టౌన్, అక్టోబర్ 7 : యానగంది సూర్యనంది క్షేత్రంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి, భవానీ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కౌన్సిలర్ రాజేశ్వరీ శివరాంరెడ్డి పాల్గొని పూజలు చేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూర్, అక్టోబర్ 7: ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని పులిమామిడికి ఇందిర మహిళా శక్తి పథకం కింద మంజూరైన డెయిరీ మిల్క్ పార్లర్‌ను జక్లేర్ సమీపంలో సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, అడిషనల్ డీఆర్డీవో అంజయ్య, ఐకేపీ ఏపీఎం నిర్మల, మాజీ సర్పంచ్ సూరయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

డెయిరీ మిల్క్‌పార్లర్‌ను ప్రారంభిస్తున్నఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కారు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

బాలానగర్(రాజాపూర్), అక్టోబర్ 7: జాత